ong-5_ong-5.qxd 4/14/2026 11:53 PM Page 1



## ఒంగోలు సమీపంలో రోడ్డు ప్రమాదం - వ్యక్తి మృతి

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ఒంగోలు మండలం వెంగముక్కపాలెం సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. టిప్పర్ వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. టీవీఎస్ ఎక్స్ఎల్‌పై వెళ్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కొండపిలో ఘనంగా అంబేద్కర్ జన్మదిన వేడుకలు

**కొండపి, ఏప్రిల్. 14 ప్రభాతవార్త**



ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత, దళితుల ఆశాజ్యోతి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జన్మదిన వేడుకలు కొండపి మండలంలో గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించుకున్నారు, కొండపి తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ శీలం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా తాసిల్దార్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు .అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రతదేశ ప్రజలకు చేసిన త్యాగాలను గురించి ఆయన సిబ్బందికి వివరించారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని నినాదాలు ఇచ్చారు. పలు గ్రామాల్లో సభలు, నిర్వహించి ,పలు సాంస్క ృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పెరిదేపి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో, అంబేద్కర్ భవనం ఆవరణంలో భారీ సభ నిర్వహించి మహనీయుడు మహోన్నతుడు దళితుల ఆశాజ్యోతి అయిన బాబా సాహెబ్ అంబేద్కర్ చేసిన త్యాగ నిరుతిని గురించి, పలువురు వక్తలు వివరించారు. అనంతరం అంబేద్కర్ భవనంలో సహపంక్తి భోజనాలు నిర్వహించారు.

## అంబేద్కర్ ఆశయాల రాజ్యాంగాన్ని అమలు చేద్దాం : ఎంపిడిఓ

**జె. పంగులూరు ఏప్రిల్ 24 ప్రభాతవార్త**



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను, ఆదర్శవంతంగా తీసుకొని ముందుకు కొనసాగుదామని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిని కె. స్వరూప రాణి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ అధికారిని కె. స్వరూప రాణి ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె. స్వరూపారాణి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలతో సమాజంలో ప్రతి ఒక్కరూ మానవత్వంతో జీవించాలనే ఉద్దేశంతో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని, భారత రాజ్యాంగం తరువాత కాలంలో అనేక దేశాల రాజ్యాంగాలకు మన రాజ్యాంగం స్ఫూర్తిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఏఈ పి ఆర్.జి. హనుమంతరావు, ఏ.పీ.ఓ. సంతోషం, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా 135 వ.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

**జె. పంగులూరు ఏప్రిల్ 14 ప్రభాతవార్త**



నిరుపేదల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని మండల తాసిల్దార్ పి సింగారావు అన్నారు. మండలంలోని ఉప్పు వరం గ్రామపంచాయతీ కార్యాలయంలో 135వ అంబేద్కర్ జయంతి ఉత్స వాలను తాసిల్దార్ పి సింగారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి తాసిల్దార్ పి సింగారావు, క్లస్టర్ ఇంచార్జి కూక్కపల్లి ఏడుకొండలు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ పి.సింగారావు మాట్లాడుతూ అనగారిన వర్గాలకు వర్గాలకు బాసటగా నిలిచి అక్షరాస్యతోనే వారు అభివృద్ధి చెందుతారని, ఆర్థిక అసమానతలను తొలగించవచ్చునని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అన్నారు. ముప్పవరం పంచాయతీ కార్యాలయంలో మండల తాసిల్దార్ మంగళవారం ది సర్వే నిర్వహించారు. 2027 మార్చి నాటికి రాష్ట్రంలో భూముల ఈ సర్వే పూర్తి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జాగర్లమూడి వారి పాలెం సొసైటీ అధ్యక్షులు అల్లమనేని బ్రహ్మానంద స్వామి, సెక్రెటరీ జానీ బేగం గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతి

**ఉలవపాడు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు అలంకరించి నివాళులు అర్పించారు. అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటంతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అదేవిధంగా తెలుగుదేశం, జనసేన, వైసిపి పార్టీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. వైసీపీ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. అదేవిధంగా తాసిల్దార్ కార్యాలయం నందు తాసిల్దార్ రవిశంకర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ రవిశంకర్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో సమాజం లో అసమానతలు రూపుమాపి సమ సమాజ స్థాపనకు అందరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని విఆర్వోలు మరియు వీఆర్ఏలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాలలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు.

## తాటి చెట్టుపై నుంచి పడి కల్లు కార్మికుడు మృతి

**కొత్తపట్నం ఏప్రిల్ 14 ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం డీటీ కాలనీకి చెందిన యాటసిరి వెంకటేశ్వర్లు (42), ఎస్.టి యానాది వర్గానికి చెందిన వ్యక్తి, దురదృష్టవశాత్తు మంగళవారం ప్రాణాలు కోల్పోయాడు. గత 20 సంవత్స రాలుగా కల్లు కార్మికుడిగా పనిచేస్తున్న ఆయన, మంగళవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో సుందరామిరెడ్డి తోటలో తాటి చెట్టెక్కి కల్లు తీస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. తాటి మట్టను పట్టుకోవడంతో మట్ట ఊడిపోవడంతో ఆయన చెట్టు మీద నుంచి కింద పడిపోయి తలకు తీవ్ర గాయం అయ్యింది. వెంటనే అక్కడ ఉన్న ఆయన మేనల్లుడు అబ్రహం అనే వ్యక్తి బాధితుడిని ఒంగోలు జిజిహెచ్ ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా, మార్గమధ్యలోనే వెంకటేశ్వర్లు మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనపై కొత్తపట్నం ఎస్ఐ వేముల సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. స్థానికంగా ఈ సంఘటన తీవ్ర విషాదాన్ని కలిగించింది.

## మహనీయుడు అంబేద్కర్

**- జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు**

**ఒంగోలు, ప్రభాతవార్త**



అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని, వారిని ఆదర్శంగా తీసుకుని నేటి యువత ముందుకు పోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు పేర్కొన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని ఫెడరేషన్ ఆఫ్ రిలియబుల్ క్యాపబుల్ ఎంప్లాయిస్ యూనియన్ వారి ఆధ్వర్యంలో ఒంగోలులోని అంబేద్కర్ భవనం నుండి నిర్వహించిన ర్యాలీని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## జిల్లా పోలీస్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

**ఒంగోలు క్రైమ్ - ప్రభాతవార్త**



భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఘనంగా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయం, ఎఆర్ కార్యాలయం, సబ్ డివిజన్ కార్యాలయాలు మరియు అన్ని పోలీస్ స్టేషన్లలో అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి గౌరవ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు అందరం కృషి చేద్దాం

**- ఒంగోలులో అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే విజయకుమార్‌లు**





**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతిని పురస్కరించుకుని ఒంగోలు నగరంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నివాళుల కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు పలు ప్రాంతాల్లో పాల్గొని అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మిరియాలపాలెం సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం, నగరంలోని పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన చిత్రపటం, అలాగే ముక్తినూతలపాడు గ్రామంలోని విగ్రహానికి పూలమాలలు వేసి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, దళిత సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి మూల విలువలను అందించిన మహనీయు డని పేర్కొన్నారు. "అంబేద్కర్ ఆశయాలు కేవలం జయంతి రోజుకే పరిమితం కాకూడదు. ప్రతి ఒక్కరి ఆచరణలో ప్రతిబింబించాలి. సమానత్వ సమాజ నిర్మాణం కోసం మనందరం కృషి చేయాలి" అని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ పి. రాజబాబు మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలు పరిపాలనలో మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. "ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. విద్య, అవగాహన ద్వారా సామాజిక మార్పు తీసుకురావడం అవసరం" అని తెలిపారు. ప్రభుత్వ పథకాలు నిజంగా అర్హులైన వారికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ, చట్టం ముందు అందరూ సమానమే అనే అంబేద్కర్ సిద్ధాంతం పోలీస్ వ్యవస్థకు పునాది అని పేర్కొన్నారు. "సమాజంలో శాంతి, భద్రతల పరిరక్షణతో పాటు ప్రతి పౌరుడి హక్కులను కాపాడటం పోలీసుల బాధ్యత. వివక్షకు తావులేకుండా న్యాయం జరిగేలా కృషి చేస్తున్నాం" అని అన్నారు. యువత చట్టాలను గౌరవిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన మార్గం నేటి యువతకు దిక్సూచి లాంటిదని, ఆయన ఆలోచనలను అనుసరిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు నీలం నాగేంద్ర, బిళ్ళా చెన్నయ్య, సుజన్, ఉద్యోగ సంఘాల నాయకులు కూడా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాల్గొన్న వారందరూ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని, సమానత్వ సమాజ నిర్మాణానికి కట్టుబడి పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఒంగోలు నగరంలో ఈ కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, అంబేద్కర్ సేవలను స్మరిం చుకుంటూ ఆయన ఆశయ సాధనకు ప్రజలు ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు.

## నీటికుంటలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి







**యర్రగొండపాలెం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. బోయలపల్లి గ్రామం శివారులో నీటి కుంటలో పడి ఇద్దరు పిల్లలు మరణించారు. ఈ ఘటన యర్రగొండపాలెం మండలం పెద్ద బొయలపల్లెలో మంగళవారం జరిగింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దబోయలపల్లి మాదిగ పాలెంకు చెందిన కొమ్ము కొండయ్య, మరియకుమారి దంపతుల కుమారుడు శశికుమార్(12), బోయలపల్లి మరియదాసు, ఏస్తేల కుమారుడు దీపన్(10) వీరిద్దరు వేసవిసెలవులు కావడంతో గ్రామానికి చెందిన నలుగురు స్నేహితులు ఆటలాడుకుంటూ సరదాగా మాదిగపాలెంకు దగ్గరలో ఉన్న అరటి తోటలోకి అరటికాయల కోసం వెళ్లారు. పొలంలో తిరుగుతు అరటి కాయలను కోసుకునే క్రమంలో పొలంలోని బురదను తొక్కారు. అక్కడే నీటి నిల్వ కోసం రైతు తవ్వుకున్న భారీ నీటి కుంట ఉండడంతో ఆ నీటి కుంట వద్దకు కాళ్ళు అంటిన మట్టిని కడుక్కునేందుకు ఇద్దరు స్నేహితులు నీటి కుంటలోకి దిగారు. నీటి కుంటలోని పట్టపై కాళ్ళు జారి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడిపోయారు. బయటకు రాలేక ఆ ఇద్దరు చిన్నారులు ఆ నీటి కుంటలో మునిగి ప్రాణాలను వదిలేశారు. మృతుల్లో దీపన్ 4వ తరగతి, శశికుమార్ 5వ తరగతి చదువుతున్నారు. ఆ పిల్లలిద్దరూ చనిపోయిన వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నీటి కుంటలో ఉన్న మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తలరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పొలాలలో కుంటలను తవ్వుకునే రైతులు నీటి కుంట చుట్టు కంచెలు ఏర్పాటు చేయకపోవడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఒంగోలులో కిరాతకం

**- తల్లిని గదిలో బంధించి సజీవదహనం చేసిన కుమారుడు**

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలోని గద్దలగుంట ప్రాంతంలో మానవత్వాన్ని కుదిపేసే దారుణ ఘటన వెలుగు చూసింది. నవమాసాలు మోసి, కనిపెంచిన తల్లిని కాపాడాల్సి న కుమారుడే ఆమె ప్రాణాలను కిరాతకంగా తీసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. అచ్చుకాల వెంకటరమణమ్మ అనే వృద్ధురాలు తన పెద్ద కుమారుడు కిషోర్ బాబుతో కలిసి ఇటీవల గద్దలగుంట్లలో అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా, చిన్న కుమారుడు చెన్నైలో ఉద్యోగం చేస్తుండగా, పెద్ద కుమారుడు కిషోర్ బాబు తల్లితోనే ఉంటూ మాంసం దుకాణం నిర్వహిస్తున్నాడు. అయితే కిషోర్ మద్యం అలవాటుకు బానిసై తరచూ తాగి వచ్చి తల్లితో గొడవ పడుతూ ఉండేవాడని స్థానికులు చెబుతున్నారు. కుటుంబంలో కొంతకాలంగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నట్లు సమాచారం. మంగళవారం ఉదయం కూడా ఇదే తరహాలో తల్లికొడుకుల మధ్య వాగ్వాదం చెలరేగింది. మాటామాటా పెరిగి తీవ్ర ఘర్షణగా మారింది. కోపాన్ని అదుపులో పెట్టుకోలేక పోయిన కిషోర్, మద్యం మత్తులోనే అమానవీయ నిర్ణయం తీసుకున్నాడు. తన తల్లిని ఇంట్లోని ఒక గదిలో బంధించి తాళం వేసి బయటకు వచ్చి, ఇంటి చుట్టూ పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో ఇంటి మొత్తం అగ్నికి ఆహుతైంది. లోపల బంధించబడిన వెంకటరమణమ్మ బయటకు వచ్చే మార్గం లేక మంటల్లో చిక్కుకుని సజీవదహనమైంది. ఆమె సహాయం కోసం అరిచినప్పటికీ ఎవరూ వెంటనే చేరుకోలేకపోయారని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటన చూసిన వారు షాక్‌కు గురయ్యారు. ఇంటి నుంచి దట్టమైన పొగ, మంటలు ఎగిసిపడుతుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే పరిస్థితి అదుపులో లేకుండా పోయింది. వృద్ధురాలి శరీరం పూర్తిగా కాలిపోయి కొంత భాగం మాంసం ముద్దలా కొంత భాగం బూడిదగా మారింది. కేవలం కాలు, చెయ్యి వంటి అవశేషాలు మాత్రమే మిగిలినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న ఒంగోలు మొదటి పట్టణ పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. నిందితుడైన కుమారుడు కిషోర్‌ను అదుపులోకి తీసుకుని కఠినంగా విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన వెనుక అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు ఈ దారుణానికి దారితీసి ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. అదేవిధంగా మద్యం మత్తు, ఆవేశం ఈ ఘటనకు ప్రధాన కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటన ఒంగోలు నగరాన్ని తీవ్రంగా కలచివేసింది. తల్లిని రక్షించాల్సి న కుమారుడే ఆమెను ఇలా హత్య చేయడం సమాజంలో పెరుగుతున్న అసహనం, మద్యం ప్రభావం, కుటుంబ విలువల క్షీణతను ప్రతిబింబిస్తోంది. ఇది ఒక్క కుటుంబం విషాదం మాత్రమే కాదు నియంత్రణ కోల్పోయిన కోపం, మద్యం వ్యసనం, మరియు కుటుంబ విభేదాలు కలిస్తే ఎంతటి భయంకర పరిణామాలు ఎదురవుతాయో ఈ ఘటన స్పష్టంగా చూపించింది.

## వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

**ఒంగోలు, ప్రభాతవార్త**



భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఒంగోలులోని జిల్లా వైఎస్సా ర్‌సీపీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి జడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంటు ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు పెద్దపీట వేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని ఆమె అన్నారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ బద్ధమైన పరిపాలన చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. కుల మతాలకు అతీతంగా ముఖ్యంగా మహిళలకు హక్కులు కల్పించి అందరికి సమాన హక్కులను రాజ్యాంగంలో పొందు పరిచిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని ఆయన పేర్కొన్నారు. విజయవాడ నడిబొడ్డులో 125 అంబేద్కర్ విగ్రహాన్ని, అంబేద్కర్ స్మృతి వనాన్ని నిర్మించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సా ర్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దేవప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ కారక్యక్రమంలో వైఎస్సా ర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలు వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్

**- సంతనూతలపాడు శాసనసభ్యులు విజయ్ కుమార్ వెల్లడి**

**సంతనూతలపాడు, ఏప్రిల్ 14. ప్రభాతవార్త**



దేశంలో ముఖ్యంగా ఎస్సీ, ఎస్టి, బిసి, మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యని సంతనూతలపాడు శాసనసభ్యులు బి. ఎన్. విజయ్ కుమార్ వెల్లడించారు. సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్లో మాజీ సర్పంచి, బాపట్ల పార్లమెంట్ టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంప తోటి అంకారావు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జరిగిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి అనంతరం ప్రసంగించారు. ఈనెల 13, 14 తేదీల్లో మండల కేంద్రమైన సంతనూతలపాడు లో మాజీ సర్పంచ్ రంప తోటి అంకారావు ఆధ్వర్యంలో డాక్టర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోలాటం, సాంస్కృతి కార్యక్రమాలు జరిగినవి. ఈ సందర్భంగా మాజీ సర్పంచి అంకారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయ్ కుమార్ ను స్థానిక అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు ఎద్దుల బండి పై ఊరేగించారు. మొదట అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేడు దేశంలో ఎందరో మేధావులు, నాయకులు గ్రాఫ్ రోజు రోజుకి పడిపోతున్నదని అయితే అంబేద్కర్ గ్రాఫ్ రోజురోజుకు గణనీయంగా పెరుగుతు న్నట్టు ఎమ్మెల్యే విజయకుమార్ పేర్కొ న్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్‌ను మాజీ సర్పంచ్ అంకారావు ఘనంగా సత్కరించారు. పర్చూరుకు చెందిన జాగర్లమూడి పద్మావతి బృందం ఆధ్వర్యంలో మహిళల చే కోలాటం పలువురును ఆకట్టుకున్నది రెండు రోజులు పాటు సంతనూతలపాడు లో మాజీ సర్పంచ్ అంకారావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగినవి. ఈ వేడుకలను బాగా నిర్వహించిన మాజీ సర్పంచ్ అంకారావును ఎమ్మెల్యే విజయ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, మండల టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, మండల టిడిపి ఉపాధ్యక్షులు మల్ల వరపు రామకృష్ణారెడ్డి, టిడిపి నాయకులు వ లేటి తిరుపతిస్వామి, టిడిపి జిల్లా నాయకులు పోతినేని శ్రీనివాస రావు అలియాస్ పి.ఎస్. ఆర్. సంతనూతల పాడు టిడిపి అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, చెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్ దుంపా సుబ్బారెడ్డి, డైరెక్టర్లు మన పాటి బ్రహ్మయ్య, మద్దిరాల శ్రీనివాసరావు, ఆనాల శ్రీనివాసరావు, జనసేన చీమకుర్తి మండల అధ్యక్షులు తాటినేని శ్రీరామ్, జనసేన పార్టీ నాయకులు ధనుష్, సాయి చరణ్, జి. ఏడుకొండలు, నంద్యాల రామయ్య, పాస్టర్ ఆర్డర్ బాబు పాల్గొన్నారు.



# అన్యాయాన్ని ప్రశ్నించటమే అంబేద్కర్ ఇజం

- దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్
- తహసీల్దార్ రవి నాయక్



**బల్లికురవ, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో తహసీల్దార్ ఎం.రవి నాయక్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా,న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, సంఘ సంస్కర్తగా భారతదేశపు మొట్టమొదటి న్యాయశాఖ మంత్రిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అణగారిన వర్గాల సామాజిక రాజకీయ హక్కుల కోసం, కుల నిర్మూలన కోసం అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. బాబా సాహెబ్ తాత్వికత చాలా లోతైనా అంశాలుగా ఆయన పేర్కొన్నారు. నిజమైన అంబేద్కర్ ఇజం అంటే అన్యాయాన్ని ప్రశ్నించే చైతన్యమని ఆయన గుర్తు చేశారు. ప్రపంచంలోనే అత్యున్నత విద్యను అభ్యసించి, దేశంలో అత్యున్నత పదవులు అధిరోహించినప్పటికీ,తన మూలాలను తన వారు పడుతున్న బాధలను ఆయన మర్చిపోలేదు అన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయటం కాదని, అది ప్రజల మధ్య ఉండే సోదర భావమని స్పష్టం చేసిన ఘనత అంబేద్కర్‌ది అన్నారు. తన అజ్ఞానాన్ని కేవలం సిద్ధాంతాలకు మాత్రమే పరిమితం చేయకుండా,దేశ నిర్మాణంలో కార్యాచరణగా మార్చి,రాజ్యాంగం లిఖించటం ద్వారా ఒక బలమైన చట్టబద్ధమైన వ్యవస్థను భారతదేశానికి అందించిన ఘనాపాటిగా,భారతరత్నగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ దేవినేని నరేంద్ర, సహకార సంఘం అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య,బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కొండేటి ఇజ్రాయిల్, డిప్యూటీ తహసీల్దార్‌లు భాష, ప్రహర్ష, వీఆర్వోలు, బోడపాటి అశోక్, వేమవరం వీఆర్వో రవి,గురవయ్య, బల్లికురవ వీఆర్వో అశోక్, వెంకటేశ్వర్లు, పోగుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబాన్ని ఆదుకున్న పూర్వ విద్యార్థులు



**మార్టూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
కోలలపూడి ఉన్నత పాఠశాల యందు 1993-94వ సంవత్సరంలో విద్యను అభ్యసించిన విద్యార్థులలో కోలలపూడి గ్రామానికి చెందిన రగుతు వీర నాగేశ్వరరావు అకాల మరణం చెందారు. వారి బ్యాచ్ చదువుకొన్న విద్యార్థులు వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.వారి కుటుంబానికి ధైర్యం చెప్పి,మా వంతు సహాయ సహకారాలు అందజేస్తామని భరోసా కల్పించి వారి కుటుంబానికి రూ.30వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు బాచిన రమేష్, కందిమళ్ళ చందు, కుంటా శంకర్, తాతా శ్రీనివాసరావులు, దాసరి వీరాంజిలు పాల్గొన్నారు.

## మార్టూరులో నేడు మంత్రి, ఎమ్మెల్యే పర్యటన

- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**మార్టూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఈనెల 15న బుధవారం మార్టూరు మండలంలో పర్యటించనున్నారు.ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ద్వారకాపాడులో ఉదయం 9.30గంటలకు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచిత సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద నియోజకవర్గంలో 13,013 మందికి రూ.159 కోట్ల వ్యయంతో లబ్ది చేకూరనుంది. అనంతరం రూ.57లక్షలతో చేపట్టిన పునర్వ్యవస్థీకృత విద్యుత్ పంపిణీ రంగ పథకం(ఆర్డీఎస్) పనులను ప్రారంభించనున్నారు. వలపర్లలో ఉదయం10.10 గంటలకు ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం సమీపంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 11.10గంటలకు రూ.2.34 కోట్లతో చేపట్టిన ఆర్డీఎస్ పనులను ప్రారంభించి, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ సరఫరా సర్టిఫికేట్లు అందజేయనున్నారు. మార్టూరులో మధ్యాహ్నం 12గంటలకు రూ.61లక్షలతో నిర్మించిన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు. అలాగే నాగరాజుపల్లి రోడ్డులో రూ.394 కోట్లతో చేపట్టనున్న ఆర్డీఎస్ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు రూ.35లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించనున్నారు.రాంనగర్‌లో మధ్యాహ్నం 1.30గంటలకు రూ.11.50లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించి, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీనివాస స్వీట్స్ అండ్ బేకరీ ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.

## అంబేద్కర్‌కు ఘన నివాళులు



**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
మండలంలోని చవటపాలెం, అమ్మనబ్రోలు గ్రామాల్లో బీఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో పలువీధిలో తిరుగుతూ అంబేద్కర్ అమరహే అంటూ నినాదాలు చేశారు. ముఖ్య అతిధిగా టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తేళ్ల మనోజ్ కుమార్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రతి వారు ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆయన వలన అభివృద్ధి చెంది ఉద్యోగాలు పొంది ఉన్నత స్థితిలో ఉంటూ కొందరు తోటి వారికి సహాయపడకపోగా వారిని తక్కువగా చూసేవారిని అగ్రకులంలోని కొందరు అహంకారులకు వారికి పెద్ద తేడా లేదని చెప్పారు. చవటపాలెం పల్లెలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ రూ.20లక్షలతో సైడు కాలువలు 5 లక్షలతో సిమెంట్ రోడ్లు, స్మశాన వాటిక చుట్టూ 4 లక్షలతో పెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రకాశం జిల్లా గ్రంధాలయ చైర్‌పర్సన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి చొరవతో ఈ కార్యక్రమాలు జరిగాయి.వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కో యూనిట్ అధ్యక్షులు మెట్టు సుబ్బయ్య నాయుడు, కవిల వినోద్, కొమ్ము రాంబాబు, ఎడ్లూరి భర్ణబాసు, దాసరి ప్రదీప్, కవిల రవి, కొమ్ము ప్రసాద్, కవిల అశోక్, కవిల తిమోతి, కవిల గిద్యోను, పాలపర్తి సుమంత్, కవిలకరుణ, ఏడ్లూరి ఎజ్రా, కొమ్ము సుబ్బయ్య, మహిళలు, యువత పాల్గొన్నారు.

## తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఏపీ విద్యార్థి ఫస్ట్



**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
తెలంగాణ రాష్ట్ర ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థి మొదటి స్థానం సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన తోమాటి రాంబట్ల చౌదరి సత్య మాధవి దంపతుల కుమారుడు అతులిత్ సాయి కార్తీక్ తెలంగాణ ఇంటర్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. హైదరాబాద్ ఎస్సార్‌నగర్ బ్రాంచ్ ఆకాష్ ఇనిస్టిట్యూట్ నందు ఇంటర్ చదువుతున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించడం పట్ల మద్దిరాలపాడు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## జెపి చెరువులో బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమం



**రాచర్ల, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
మండలంలోని జెపి చెరువు గ్రామ పంచాయతీ సచివాలయములో జరిగిన మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి షేక్ మహ బూబ్ బాషా, పంచాయతీ కార్యదర్శి వీర గురుదుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎంసి చైర్మన్ షేక్ మహ బూబ్ బాషా, శ్రీ నెమలి గుండ్ల రంగ నాయక స్వామి దేవస్థానం చైర్మన్ సిద్ధం నరసింహులు హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు మేకల తిరుపాల్, నీటి సంఘం అధ్యక్షులు జమాల్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు



**కొనకనమిట్ల, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జరిగిన అంబేద్కర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి ఆర్ఐ బత్తుల శ్రీనివాసరావు పూలమాల వేసి ఆయన సేవలను స్మరించు కున్నారు. కార్యాలయ జూనియర్ సహాయకులు రాజశేఖర్, గ్రామ రెవెన్యూ అధికారులు జానయ్య ఎంఎన్‌వీ దిలీప్ కుమార్, గ్రామ సర్వేయర్లు, గ్రామ సహాయకులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**ఇరుసలగుండం ఎస్సీ కాలనీలో :**
ఇరుసలగుండం ఎస్సీ కాలనీలో అంబేద్కర్ యూత్ ఫోర్సు,గ్రామపెద్దలు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అంబేద్కర్ జయంతి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభ నిర్వహించి, భోజనం ఏర్పాటు చేశారు.

## ముక్తేశ్వరంలో ప్రతిష్ఠకు ముస్తాబవుతున్న రామాలయం





**బల్లికురవ, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
ప్రశాంతతకు మారుపేరైన పచ్చని పల్లె సీమలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటూ భక్తి భావంతో పులకించిపోతున్నాయి. సామాజిక ఐక్యతకు ప్రతి రూపంగా నిలుస్తున్న గ్రామస్తులు సమిష్టి సహకారానికి తోడు,దాతల దాతృత్వంతో చేయూత నివ్వడంతో కోట్ల రూపాయల వ్యయంతో ఆలయాలను నిర్మిస్తూ, భగవంతునిపై తమకు ఉన్న భక్తిని చాటుతున్నారు. మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో రూ.కోటి రూపాయలకు పైగా వ్యయంతో సీతారామ, లక్ష్మణ సమేత,వినాయక,చారుధ్వజ, శిఖర, ఆంజనేయస్వామి రామాలయాన్ని సర్వాంగ సుందరం గా తీర్చిదిద్దారు. మే నెల 1వ తేదీన శుక్రవారం,స్వాతి నక్షత్ర యుక్త మిధునలగ్న పుష్కరాంశమునందు ఉదయం 10.15 నిమిషాలకు ప్రతిష్ఠాపన ముహూర్తాన్ని నిర్ణయించినట్లు ఆలయప్రధానపూజారి యామిలేశ్వరశర్మ తెలియజేశారు. ఈ క్రమంలో భాగంగా యజ్ఞశాలల నిర్మాణం, చురుకుగా కొనసాగుతుంది.

## ఘనంగా వెంకటేశ్వరస్వామి నామాల వార్షికోత్సవం



**బల్లికురవ, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
ఓం నమో వెంకటేశాయ నామస్మరణతో మండల కేంద్రమైన బల్లికురవ గ్రామం పులకించిపోయింది. బల్లికురవ, అద్దంకి ప్రధాన రహదారి పక్కనే, గ్రామదేవత పోలేరమ్మ తల్లి ఆలయ సన్నిధికి సమీపంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన వెంకటేశ్వరస్వామి నామాల మొదటి వార్షికోత్సవ వేడుక మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు సుధీర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన చందన, కుంకుమపువ్వు, అభిషేకాలు, పాలు, పెరుగు, కొబ్బరి నీళ్ల స్నానాలు, కొనసాగాయి. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పరణ కార్యక్రమం కొనసాగింది.

## యుగకర్త.. అంబేద్కర్





**తాళ్లూరు, ఏప్రిల్ 14,ప్రభాతవార్త**
అణగారిన వర్గాలకే కాకుండాయావత్ భారతదేశానికి సమతావాదాన్ని, ప్రజాస్వామ్య వాదాన్ని అందించిన మహోన్నతుడు, యుగకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు కొనియాడారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి. అజిత అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ సామాజిక సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం బోధించు, సమీకరించు, పోరాడు. అనే అంబేద్కర్ ఆలోచన విధానాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.అలాగే మండలంలో అన్ని గ్రామ స్వర్ణ కార్యాలయాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభలు నిర్వహించారు. 202526 సంవత్సర జమా ఖర్చులు, 202627 సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, బకాయిలు, తాగు నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, ఇతరత్రా మౌలిక వసతుల కల్పనపై సభలో చర్చించారు. ఆయా కార్యక్రమాలలో జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు మేడగం వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ ఐ. వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి, నాయకులు మానం రమేష్, వల్లభనేని సుబ్బయ్య, గొల్లపూడి వేణుబాబు, రాచకొండ వెంకట్రావు,శివ నాగిరెడ్డి,గంగిరెడ్డి కృష్ణారెడ్డి, సానెసురేష్, ఐవి సుబ్బారెడ్డి, చాట్ల దాని, షేక్ బేరి,జాష్టి గిరి, ఇరిగేషన్ ఏఈ సుబ్బారావు,పంచాయతీ అభివృద్ధి అధికారులు డి. మల్లేశ్వరి, షేక్ షహనాజ్ బేగం,పులి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో అంబేద్కర్‌కు ఘన నివాళులు



**సంతనూతలపాడు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
సంతనూతలపాడు కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు పర్యవేక్షణలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ఎంపీపీ బుడంగుంట విజయ నాగేశ్వరరావు, జడ్పీటీసీ దుంపా రమణమ్మ,మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మధురకవి, రిటైర్డ్ ఉపాధ్యాయులు అట్లూరి రామారావు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంబేద్కర్ రాజ్యాంగ రూపశిల్పి, ప్రపంచ మేధావి ముఖ్యంగా మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ అంబేద్కర్ అని ఎంపీడీవో సురేష్‌బాబు,ఎంపీపీ విజయ, జడ్పీటీసీ రమణమ్మ, తమతమ ప్రసంగాల్లో కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వాసంతి,ఈసీ ఈశ్వరి,సంఘాల నేతలు బి.నాగేశ్వరరావు, టి.ఆల్రైడ్, ఎల్లమంద, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముప్పాళ్ళపాడులో ఘనంగా అంబేద్కర్ జయంతి ఉత్సవం



**హనుమంతునిపాడు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండల పరిధిలోని ముప్పాళ్ళపాడు గ్రామం నందు భారత రాజ్యాంగ నిర్మాత సింబల్ ఆఫ్ నాలెడ్జ్ భారతరత్న బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అందరివాడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ 135వ పుట్టిన రోజు ఉత్సవం పెరుమాళ్ళ బాల చెన్నయ్య, దమ్ము వెంకట చెన్నయ్య, కొటికల చిన్న బాదుర్ల , దమ్ము నాగరాజు, కొటికల బాలబాదుర్ల వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా అంబేద్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చదలవాడ బాల గురవయ్య లాయర్ బాల నారాయణ, మాలల ఐక్యవేదిక అధ్యక్షులు కలవకూరి శాంతరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరంఅల్పాహార విందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలూరి సెల్వ కుమార్, స్వర్ణ యానది కుందుర్తి వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ వెంకటయ్య, జొన్నలగడ్డ ధర్మేందర్, ఉస్సెల లక్ష్మీ నారాయణ, పెరుమాళ్ళ విజయ్ కిరణ్, కుందుర్తి వెంకటేశ్వర్లు, ఆత్మకూరి బాలయ్య, దమ్ము రవి, రాయుడు, తీట్ల నారాయణ, పాపా పత్తిని నాగయ్య, డీలర్ కంది లాజరస్, లింగం గుంట్ల చెన్నకేశవులు, శెట్టి రామచంద్రయ్య, వేము వెంకయ్య, కనపర్తి నాగరాజు,జల్ది నారాయణ, కల్లు వెంకట నారాయణ పాపా బత్తిని కాశయ్య, పాపాబత్తిని పిచ్చయ్య, కల్లు వెంకటరామయ్య, అక్కిదాసరి చిన్న గూడూరు జయరావు, గూడూరు కొండయ్య, బొజ్జ జేమ్స్, గోసుల జన్‌రావు, పాస్టర్ పాపాపత్తిన నారాయణ, బాబు, పాపా బత్తిని జయరాములు, కోలాస్, సామ్యేలు,గూడూరు వెలుగొండయ్య, పరిసెపోగు నెహేమియా, కంచం గురుస్వామి, బొప్పరాజు, బాలకృష్ణ, రాయల శ్రీను, కుమ్మరి నాగేశ్వరరావు, గట్ల తిరుపతిరెడ్డి, కటికల విజయానందం, కొటికల బాల వెంకటేశ్వర్లు, పెరుమాళ్ళ రోశయ్య, పెరుమాళ్ళ బాలచంద్ర, కొటికల లింగయ్య, కొటికల బాలకేశవ, కొటికల కొండయ్య శెట్టి, ఇజ్రాయిల్, కొటికల వెలుగొండయ్య, మాదాల గరటయ్య, కుమ్మరి నాగేశ్వరరావు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

## పొదిలిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**పొదిలి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
పొదిలి పట్టణంలో భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏబీఎం పాఠశాల ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అంబేద్కర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. వరికుంట్ల అనిల్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి దిక్సూచి వంటి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, పొదిలి ఏఎంసీ చైర్మన్ సయ్యద్ ఇమాంస, మర్రిపూడి ఎంపీపీ వాకావెంకటరెడ్డి, బీజేపీ మహిళా మోర్చారాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ విజయలోక్ష్మి, దళిత మహాసభ నాయకులు ధర్నాసి పెద్దన్న, మాదాల వారిపాలెం సింగిల్ విండో అధ్యక్షులు ఎర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఏఎంసీ డైరక్టర్ రోళ్ల శ్రీను, మైనార్టీ నాయకులు గౌస్ భాషా, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## చివరి పేదవాడికి రాజ్యాంగ ఫలాలు చేరాలి




**సింగరాయకొండ, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
దేశంలో అమలవుతున్న రాజ్యాంగ ఫలాలు చివరి పేదవాడి వరకు చేరినప్పుడే డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయం సాకారమవుతుందని తహసీల్దార్ ఎన్.వి.బి.రాజేష్ పేర్కొన్నారు.సింగరాయకొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి, మండల పరిషత్ ఉప అభివృద్ధి అధికారి శారద అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గానికీ రాజ్యాంగ హక్కులు, సంక్షేమ ఫలాలు చేరేలా కృషిచేయాలని సూచించారు. అభివృద్ధి,స్వాభిమానం, స్వావలంబన దిశగా అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.శారద మాట్లాడుతూ ప్రజలు విద్యపై దృష్టి సారించి,పిల్లలను పాఠశాలలకు పంపుతూ రాజ్యాంగం అందించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షులు యస్థాని బాషా,నాయకులు చీమకుర్తి కృష్ణచైతన్య,రాజేష్, కె.శ్రీనువాసులు,గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**సింగరాయకొండ, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
మండల వ్యాప్తంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సింగరాయకొండ ప్రొహిబిషన్ అండ్ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ ఎం.శివకుమారి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మూలగుంటపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ డి. జయమణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామ సభ నిర్వహించి గ్రామంలోని సమస్యలు,అభివృద్ధి అంశాలపై గ్రామస్థులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో నాయకులు నరాల సుధాకర్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎండ్లూరు అరుంధతి నగర్‌లో ఘనంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు



**సంతనూతలపాడు, ఏప్రిల్ 14,ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం ఎండ్లూరు అరుంధతి నగర్‌లో మంగళవారం నాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, జగ్జీవన్‌రావ్ విగ్రహాలకు పలువురుపూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆర్టీసీ కార్మిక సంఘ నాయకులు అన్నంగి సుబ్బారావు అధ్యక్షతన ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ బీవీఆర్ఎస్ కుమార్ ముఖ్య అతిధిగా విచ్చేశారు. దేశ అభ్యున్నతకు అంబేద్కర్ చేసిన సేవలను పలువురు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో బహుజన కవి, రిటైర్డ్ ఉపాధ్యాయులు అట్లూరి రామారావు, కేవీపీఎస్ నాయకులు అట్లూరి రాఘవులు, రిటైర్డ్ హెచ్ఎం అట్లూరి అమ్మయ్య, న్యాయవాదులు ఏ.సుధాకర్, బి.ఏడుకొండలు, ఎంఈఎఫ్ నాయకులు తాళ్లూరి ఆల్ఫ్రెడ్, బీఎస్పీ నాయకులు ఎల్లమంద, సంఘ నాయకులు అట్లూరి జకరయ్య తదితరులు పాల్గొన్నారు. ముఖ్యంగా స్థానిక అరుంధతి నగర్‌లో విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంపుకు గ్రంధాలయం అవసరమని ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు ఈ సందర్భంగా కోరారు. మొదటగా కవి, ఉపాధ్యాయులు అట్లూరి రామారావు ఆధ్వర్యంలో ఒక సంవత్సరం పాటు వార్తా పత్రికలు ఈ గ్రంధాలయానికి తదుపరి ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. పలువురు రామారావును ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం సంఘ నాయకులు అట్లూరి జకరయ్య, తన తండ్రి లింగయ్య పేరుతో అన్నదానం నిర్వహించారు.

## ఏడాది ఏడాదికి పెరిగిపోతున్న అంబేద్కర్ గ్రాఫ్

- సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ వెల్లడి



**సంతనూతలపాడు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
నేడు దేశంలో పలువురు గ్రాఫ్ రోజు రోజురోజుకు తగ్గిపోతుంటే రాజ్యాంగ నిర్వాహకులు , ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గ్రాఫ్ ఏడాది ఏడాదికి పెరిగిపోతుందని సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. సంతనూతలపాడు టీడీపీ కార్యాలయంలో మంగళవారం నాడు మండల టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి అంబేద్కర్ 135వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కంకణాల గోపికృష్ణ అధ్యక్షత వహించారు. దేశ అభ్యున్నతకు అంబేద్కర్ కృషి మరువరానిదని ఎమ్మెల్యే విజయ్ కుమార్ వెల్లడించారు. దేశ, ప్రపంచ దేశాల్లో అంబేద్కర్ సేవలను పలువురు కొనియాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు కూడా పలు రంగాల్లో రిజర్వేషన్‌ను అంబేద్కర్ కల్పించారన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ నడుం బిగించాలని ఎమ్మెల్యే విజయ్ కుమార్ కోరారు. మొదట స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే విజయ్ కుమార్ కట్ చేశారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే విజయ్ కుమార్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కంకణాల గోపికృష్ణ, టీడీపీ ఎస్సీసెల్ నాయకులు కోతి కోటేశ్వరరావు, టి.నరసింహారావు,సాదు కొండలరావు, మార్పుడి జనార్ధన్, అట్లూరి అశోక్ తదితరులు పర్యవేక్షించారు. అనంతరం మండల టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అన్నదాన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి తన్నీరు శ్రీనివాసరావు, బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రావుపల్లి వెంకట సురేష్‌బాబు, ఎన్నెస్పీ డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులు నల్లూరి కృష్ణారావు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, మండల టీఎన్‌టీయుసీ అధ్యక్షులు పావులూరి నారాయణస్వామి చౌదరి, నీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు సంకే సుబ్బారావు, టీడీపీ నాయకులు కరిచేటి శ్రీనివాసరావు, కొంకా చిన్నారావు, నువ్వుల మీరయ్య, ఆళ్ల రాము, పాతూరి రాంబాబు, వలేటి తిరుపతి స్వామి, ఆళ్ల రాము, మార్పుడి అంజయ్య, తాళ్లూరి శేషారావు, ఎం.చిరంజీవి, బత్తుల శ్రీను, సీహెచ్ చేజర్లయ్య, పాలపర్తి శ్రీనివాసరావు, దాసరి బాబురావు వంకాయలపాటి కోటేశ్వరరావు, బొడ్డపాటి చంద్రశేఖర్, నాదెండ్ల ఆంజనేయులు, ఎడ్లూరి నాగరాజు, చిట్టంశెట్టి శ్రీనివాసరావు, గుండవరపు సుబ్బారావు, ఆళ్ల బ్రహ్మయ్య, నలుమూతు శ్రీనివాసరావు, మారెళ్ళ రామారావు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మైనంపాడు, పేర్నమిట్ట తదితర కేంద్రాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. సంతనూతలపాడులోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## వైఎస్సార్సీపీ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు



**పొన్నలూరు,ఏప్రిల్ 14,ప్రభాతవార్త**
భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను పొన్నలూరు వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు గౌడపేరు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ శ్రేణులుఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు,కార్యకర్తలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, పల్లపోలు బాలకోటిరెడ్డి, పిల్లి తిరుపతిరెడ్డి, కాటా మాధవరావు, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, తవ్వా బ్రహ్మారెడ్డి, కనపర్తి గోవిందమ్మ, యర్రా రామకృష్ణ, కాటా మల్లికార్జున, గడ్డం మాల్యాద్రి, గుత్తికొండ కళ్యాణి,మన్నెం రవణయ్య, నవులూరి మధు, గొర్రెపాటి మహేష్,ఇండ్లా శీనమ్మ. పచ్చవ వంశీకృష్ణ, ముత్తంగి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు



**పొన్నలూరు ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన పొన్నలూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మాట్లాడినాయకులు అంబేద్కర్ సేవలను కొనియాడుతూ, సమాజంలో సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు . ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు కర్ణ కోటిరెడ్డి,మండవ ప్రసాద్,అనుమోలు సుధాకర్,తానికొండ మహేంద్ర,మండవ మురళీమోహన్,ఎస్సీ సెల్ నాయకులు,ఎండ్లూరి ఆదాము,చుండి సింగయ్య,చుండి రమేష్,గంధం నరసయ్య,ఇతర మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మార్కాపురం వార్త

## ఘనంగా కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు



**సీఎస్‌పురం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
భారత రాజ్యాంగ నిర్మాత,సంఘ సంస్కర్త భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది,విద్యార్థులు అంబేద్కర్ చిత్రపటానికిపూలమాల వేసి నివాళులర్పించారు. అంటరానితనంతో కుల వివక్షతకు గురై కూడా ఉన్నత విద్యను అభ్యసించి దేశం గర్వించే అత్యున్నత స్థాయికి ఎదిగిన అంబేద్కర్ ఆదర్శప్రాయులు అని అన్నారు. సమాన అవకాశాలు, హక్కులు అందించి, ప్రతి పౌరుడికి రాజ్యాంగ రక్షణ కల్పించారని ఈ సందర్భంగా వారిని స్మరించుకున్నారు.

## వాసవి మహోత్సవానికి విచ్చేసిన స్వామీజీ

### - మహేష్ దంపతులకు ఆశీర్వచనాలు



**కనిగిరి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
వారణాసికి చెందిన పరమ పూజ్య శ్రీశ్రీ వామన శ్రమ మహ స్వామీజీ శ్రీ నాగేంద్ర శ్రీచక్ర సహిత శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి పున:ప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవానికి విచ్చేసిన సందర్భంగా పట్టణంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్వామీజీ స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ మాతా జ్యువెలర్స్ యాజమానులు తాళ్లూరి మహేష్, అరుణ దంపతుల గృహానికి వెళ్లి వారికి ఆశీర్వచనాలు అందించారు. భక్తులను ఆశీర్వదిస్తూ స్వామీజీ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, అమ్మవారి కటాక్షంతో వారి వ్యాపారాలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి సత్ర సముదాయాల చైర్మన్, శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు దేవకి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయులే మార్గదర్శకులు

### - కలెక్టర్ ఎం విజయ సునీత





**మార్కాపురం, ఏప్రిల్ 14,ప్రభాతవార్త**
రాష్ట్రోపాధ్యాయ సంఘం మార్కాపురం-తర్లుపాడు మండల శాఖల ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 136వ జయంతి ఉత్సవాలు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. మండల శాఖ అధ్యక్షులు అక్కల నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులే ప్రధాన మార్గదర్శకులని స్పష్టం చేశారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల శ్రమ కలిసి విద్యార్థుల అభివృద్ధికి బలమైన పునాది వేస్తాయని పేర్కొన్నారు.అంబేద్కర్ జయంతి సందర్భంగానిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సంఘానికి ఆమె అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పివి కృష్ణారావు, సీపీఐ నాయకులు ఎస్కే కాసింవలి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు రామకృష్ణ, తిప్పాయపాలెం పిహెచ్‌సి డాక్టర్ రోహిత్, తర్లుపాడు మండల విద్యాధికారి ఏ. అచ్యుత సుబ్బారావు,మరియు ఇతర సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌కు కొత్త ఎస్సైగా సైదుబాబు నియామకం



**పెద్దారవీడు, ఏప్రిల్ 14,ప్రభాతవార్త**
పెద్దారవీడు పోలీస్‌స్టేషన్‌కు కొత్తఎస్సైగా సైదుబాబు నియమితుల య్యారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం పెద్దారవీడులో ఎస్సైగా పనిచేస్తున్న సాంబశివరావును ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేసినట్లు తెలిసింది. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సైదుబాబు గతంలో మార్కాపురం పట్టణంలో ఎస్సైగా పనిచేసి సమర్థవంతమైన అధికారిగా మంచి గుర్తింపు పొందారు.ఆయన నియామకంతో పెద్దారవీడు మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## చదువే ఆయుధం.. అంబేద్కర్ మార్గం

### - అంబేద్కర్ ఆశయ సాధనకు సమిష్టి కృషి అవసరం







**మార్కాపురం, ఏప్రిల్ 14,ప్రభాతవార్త**
భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మార్కాపురంలో ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తదితరులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ, సమాజంలో అంటరానితనం, కుల వివక్షత నిర్మూలనతో పాటు సామాజిక చైతన్యం కోసం అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.బాల్యంలోనే వివక్షతను ఎదుర్కొని, కష్టపడి చదువుతో ఉన్నత స్థాయికి ఎదిగిన అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడిగా దేశానికి రాజ్యాంగాన్ని అందించి,చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. దేశ తొలిన్యాయశాఖ మంత్రిగా సమగ్రంగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు.ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ,అంబేద్కర్ చదువు-సమీకరించు-పోరాడు" అనే నినాదం నేటి యువతకుమార్గదర్శకమని అన్నారు. న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ అనే విలువలను భారత సమాజంలో స్థాపించిన మహనీయుడిగా ఆయనను అభివర్ణించారు. వర్ణ వివక్షత లేని సమాజ నిర్మాణమే జాతికి నిజమైన సంపద అని స్పష్టం చేశారు.అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అంబేద్కర్ ఆశయాల సాధన దిశగా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు.పీఎం సూర్య ఘర్" పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి, విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఆదాయం పొందే అవకాశాన్ని కల్పిస్తున్నారని వివరించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగరాజు,ఏఎస్‌డబ్ల్యూవో శివనాయక్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఇతర ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

## భారత జాతి ముద్దుబిడ్డ అంబేద్కర్

### - ప్రజాస్వామ్యానికి పునాది వేసిన మహానుభావుడు

### - మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



**మార్కాపురం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా మార్కాపురంలో ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు మాట్లాడుతూ అంబేద్కర్ భారత జాతి ముద్దుబిడ్డగా నిలిచారని కొనియాడారు. మార్కాపురం కోర్టు సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఆయన, ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రజాస్వామ్య వ్యవస్థగా భారతదేశాన్ని తీర్చిదిద్దడంలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. తన శక్తి, సామర్థ్యాలన్నింటినీ వినియోగించి దేశానికి అపార సేవలు అందించారని గుర్తుచేశారు.అణగారిన వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగ రచనలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిన అంబేద్కర్, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతూ సామాన్యుల హక్కుల కోసం కృషి చేశారని పేర్కొన్నారు. బూర్జువా, పెత్తందారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం నేటికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు.సమాజంలోని అన్ని వర్గాల శ్రేయస్సే తన లక్ష్యంగా పెట్టుకున్న అంబేద్కర్ ఆశయాలను నేటి తరం ఆచరణలో పెట్టాలని రాంబాబు పిలుపునిచ్చారు.

## దీర్ఘకాల సమ్మెకు తెర.. మార్కాపురం పరిశ్రమలకు ఊరట



**మార్కాపురం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలో గత 73 రోజులుగా కొనసాగుతున్న కార్మిక సమ్మె నేటితో ముగిసింది. ది మార్కాపురం ఎనామిల్ స్లేట్ ఆపరేటర్స్ అండ్ వర్కర్స్ యూనియన్,అలాగే ది మార్కాపురం ప్లాస్టిక్ ఫ్రేమ్డ్ టిన్ స్లేట్స్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ కార్మికులు వేతనాల పెంపు డిమాండ్‌తో చేపట్టిన ఈ సమ్మెను యూనియన్ అధ్యక్షుడు, జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్ యాజమాన్యంతో నిర్వహించిన చర్చల ద్వారా విజయవంతంగా ముగింపుకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ, కార్మికులు ఎదుర్కొంటున్న వేతన సమస్యలపై యాజమాన్యంతో విస్తృతంగా చర్చించామని తెలిపారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవడంతో సమ్మె ముగిసిందని పేర్కొన్నారు. గత 73 రోజులుగా నిలిచిపోయిన ఫ్యాక్టరీలు రేపటి నుంచి యథావిధిగా కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. సమ్మె ముగియడంతో పరిశ్రమ వర్గాల్లో ఊరట నెలకొంది.

## పరీక్షా సమయంలో ఆరోగ్య జాగ్రత్తలు అవసరం

### - జెవివి జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ శరత్



**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
త్వరలో జరగబోవు ఎంట్రన్స్ పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని జన విజ్ఞాన వేదిక ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి.శరత్ సూచించారు.స్థానిక శ్రీవిద్య ఎంసెట్ కోచింగ్ సెంటరులో పోటీ పరీక్షలు ఆరోగ్య జాగ్రత్తలు అనే అంశంపై జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ శరత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంట్రన్స్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పాఠ్యాంశాలను సరైన అవగాహనతో అభ్యసించాలన్నారు. అభ్యసనలో సందేహాలను అధ్యాపకులతో ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుంటూ పరీక్షల్లో రాణించాలన్నారు. ఎండల తీవ్రత పెరిగినందున తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జన విజ్ఞాన వేదిక ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి ఏనుగుల రవికుమార్ మాట్లాడుతూ కూల్‌డ్రింక్స్ బదులుగా మజ్జిగ, కొబ్బరి నీళ్లు, రాగి జావ వంటి సహజ పానీయాలే సేవించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక పట్టణ కార్యదర్శి గుండాల ముక్తేశ్వరరావు, దోర్నాల మండల అధ్యక్షులు గోనావత్ ప్రతాప్ నాయక్, శ్రీవిద్య కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సిహెచ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## బోయలపల్లి గ్రామంలో జరిగిన హృదయ విచారక సంఘటనపై శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ దిగ్భ్రాంతి



**యర్రగొండపాలెం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం నియోజకవర్గంలో బోయలపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం జరిగిన దుర్ఘటనలో 10 ఏళ్ల చిన్నారి కొమ్ము శశికుమార్, 8 ఏళ్ల బోయలపల్లి దీపన్ నీటి కుంటలో పడి ప్రమాదవశాత్తు మృతి చెందిన దుర్ఘటనపై యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయం తెలియగానే హుటాహుటీన ప్రభుత్వ హాస్పిటల్ చేరుకుని, మృతుల తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆ చిన్నారుల మృతదేహాలను చూసిన ఆయన చలించిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, పిల్లలు మన భవిష్యత్తు అని వారి భద్రత కోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. అదే విధంగా గ్రామాల్లోని రైతులు నీటి కుంటలు, గుంటలు, బావులు సరైన రక్షణ పాటించాలని తెలిపారు. గ్రామాల్లో తల్లిదండ్రులు పిల్లలను ఒంటరిగా వదిలేయకుండా సరియైన పర్యవేక్షణలో ఉంచాలని ఆయన సూచించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూర్చాలని కోరారు. కుటుంబ సభ్యులందరూ ధైర్యంగా ఉండాలని తెలిపారు.

## అంబేద్కర్ జయంతిలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



**యర్రగొండపాలెం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
భారత రాజ్యాంగ నిర్మాత భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా యర్రగొండపాలెం శాసనసభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పార్టీ శ్రేణులతో కలిసి యర్రగొండపాలెం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తిదాయక జీవితం, ఆయన చూపిన సమానత్వ మార్గం భారత సమాజానికి చిరస్థాయిగా మార్గదర్శకమని, ఆయన ఆశయాల సాధన ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసాలారెడ్డి, పట్టణ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాలకు శ్రీకారం

### - మార్కాపురంలో ఘన ప్రారంభం






**మార్కాపురం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
అగ్ని ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలు మార్కాపురంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 14 నుండి 20 వరకు జరుగనున్న ఈకార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మార్కాపురం అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ సర్వీస్ కమేమొరేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత హాజరై అగ్ని ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్విప్మెంట్ స్టాల్‌ను ప్రారంభించి, అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజల్లో చైతన్యం అవసరమని పేర్కొన్నారు. కలెక్టర్ చేతుల మీదుగా అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించే పాంప్లెట్లు, పోస్టర్లు ఆవిష్కరించారు.ఈ వారమంతా నివాస భవనాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాములు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, స్లమ్ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సదస్సుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రమాదం సంభవించినప్పుడు ప్రాణాలు,ఆస్తిని ఎలా కాపాడుకోవాలో ప్రజలకు వివరించనున్నారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి రేగలగడ్డ రామకృష్ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## డా॥అంబేద్కర్ ఆశయాలు చిరస్మరణీయం



**కందుకూరు ఏప్రిల్ 14,ప్రభాతవార్త**
డా.బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలు చిరస్మరణీయమని కందుకూరు ఎంపీడీవో పి.రత్నజ్యోతి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంబేద్కర్ 135జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవోతోపాటు పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డా॥ అంబేద్కర్ ప్రపంచమేధావిగా వ్యాఖ్యానించారు. ఆయన సేవలు చిరస్మరణీయమని ప్రశంసించారు.డా॥ అంబేద్కర్ జయంతి సందర్భముగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు ప్రత్యేక అధికారుల ఆధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి,ఆయనకు ఘనంగా నివాళులు అర్పించినట్లు రత్నజ్యోతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీవో బాషా,డిప్యూటీ ఎంపీడీవో ఓబులేషు, శ్రీనివాసరెడ్డితోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## త్రిపురాంతకంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**త్రిపురాంతకం, ఏప్రిల్ 14,ప్రభాతావార్త**
డాక్టర్ బి ర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మండల కేంద్రమైన త్రిపురాంతకం లోని అన్నిప్రభుత్వ కార్యాలయాల్లో అధికారు లందరు సమన్వయంతో నిర్వహించారు. ముందుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహశిల్దార్ విజయభాస్కర్ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ ఒక కుగ్రామంలో జన్మించి, వనరులు, అవకాశలు లేకపోయినా ఉన్నతమైన చదువులు చదివి భారత రాజ్యాంగాన్ని రాచించుటలో కీలక భూమిక పోషించారని, మనదేశానికి న్యాయశాఖ మంత్రి పని చేశారని, ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందారని, ఆ మహనీయుని గురించి ఎంత చెప్పిన, పొగడినా దానికి అవధులు, హద్దులు ఉండవని, ప్రపంచంలో ఏ ఒక్కరిని ఆయనతో పోల్చలేమని, ఆయనకు ఆయనే సరిపాటి అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజభాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్,రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రావు, మండల సర్వేయర్ సైదా రావు, విఆర్ఓలు, పిఎస్‌లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోగల అంబేద్కర్ నగర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యుడు డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజ్ పూలమాల వేసి జై భీమ్ జై భీమ్ అని జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ వాసులైన దళిత బిడ్డలందరు పాల్గొన్నారు.తదుపరి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి గొప్పగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహ మూర్తి,ఉపాధి హామీ పథకం అధికారిణి సుజాత, డిప్యూటీ ఎంపీడీఓ రామలింగేశ్వర రావు, ఏఓ సాంబశివరావు, సీనియర్ అసిస్టెంట్ ఖాదర్ వలి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శివరామయ్య ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేద్కర్ ఫొటోకు పూల మాలలు వేసి కార్యక్రమానికి జయకరంగా చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ శివరామయ్య, ఏ ఎస్ఐ సంజయ్,రైటర్ శ్రీనివాస్, కాన్స్టేబుల్ రెడ్డె నాయక్, వెంకట రెడ్డి, కత్తి మోహన్,మురళి మోహన్, రమణ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

### - అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకాలు

### - డీఎస్‌పి యు.నాగరాజు



**మార్కాపురం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మార్కాపురం జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా డీఎస్పీ డాక్టర్ యునాగరాజు అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ మార్గ దర్శకాలని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడి ఆశయాల సాధనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ అంబేద్కర్ ఒకవ్యక్తి మాత్రమే కాదు, ఒక శక్తి, ఒక వ్యవస్థ" అని అభివర్ణించారు. విద్యార్థి దశలోనే అనేక అవమానాలు, జాతి వివక్షను ఎదుర్కొని, తన మేధస్సు, పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మహోన్నత వ్యక్తిగా నిలిచారని కొనియాడారు. అలాగే, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు అంబేద్కర్ అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రజక అభివృద్ధి సంక్షేమానికి ఎమ్మెల్యే కృషి - సబ్సిడితో కూడిన రుణాలు మంజూరు



**కందుకూరు ఏప్రిల్ 14,ప్రభాతవార్త**
కందుకూరు నియోజకవర్గంలో రజకుల అభివృద్ధి సంక్షేమానికి స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషిచేస్తున్నట్లు పలువురు రజకసంఘనేతలు వ్యాఖ్యానిస్తున్నారు.గతంలో అనేక సమస్యలుతో సతమతమయ్యేవారమన్నారు.ఇటీవల ఎమ్మెల్యే నాగేశ్వరరావు హయాంలో తమసమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రజకకాలనీలోని సమస్యలను గుర్తించి పరిష్కారినికి కృషిచేస్తున్న ఎమ్మెల్యేకి పలువురు కృతజ్ఞతలన్నారు. అయితే నియోజకవర్గంలో సుమారు 10వేలమందికి పైగా రజకజనాబా ఉంది. ఇందులో అనేక మంది తమవృత్తిని నిరాటంకంగా సాగించుకోవడానికి ఆర్థిక స్తోమతలేక ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఆధరణ పథకం కింద ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు వృత్తిపరికరాలు మంజూరు చేశారు.అయితే తాజాగా వీరికి వృత్తిపరికరాలు కొనుగోలుకు రాయితీతో కూడిన రుణం మంజూరుచేయాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా బీసీ కార్పోరేషన్ రుణాల లబ్దిదారుల ఎంపికలో రజకులు కోటా కేటాయించాలని కోరుతున్నారు. అదేవిదంగా ఆయా గ్రామాల్లో రజకులు ఇంటినివేశన స్థలంలేక ఇబ్బందిపడుతన్నారు. అర్హులకు ఇళ్ల స్థలం ఇప్పించాల్సిందిగా పలువురు ఎమ్మెల్యే నాగేశ్వరరావుకి విజ్ఞప్తిచేస్తున్నారు.

### కందుకూరులో చప్టా - మాజీ కౌన్సిలర్ బ్రహ్మయ్య



కందుకూరు పడమటి రజకపాలెంలో విప్పగుంట రోడ్డులో చప్టాకూలిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిపడేవారమని కందుకూరు మాజీ కౌన్సిలర్ బ్రహ్మయ్య తెలిపారు. అయితే నాగేశ్వరరావు ఎమ్మెల్యే అయిన వెంటనే మా సమస్యతోనే ఆయన అభివృద్ధి ప్రారంభించారని తెలిపారు.సుమారు రూ.10 లక్షలకి పైగా వెచ్చించి చప్టా నిర్మించారని తెలిపారు. దీంతో రజకకాలనీవాసు లేకాకుండా విప్పగుంట, పామూరు వైపు వెళ్లే ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు.

### వలేటివారిపాలెంలో 2 బోర్లు - యలమందల మహేష్



వలేటివారిపాలెంలో రజకకాలనీలో మంచినీటికి గత కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులు పడేవారమని రజకసంఘనేత యలమందల మహేష్ తెలిపారు. ఎమ్మెల్యే అధికారంలోకి రాగానే వలేటివారిపాలెం గ్రామతెదేపా నాయకులు ఆధ్వర్యంలో ఒక బోరు నిర్మించారని తెలిపారు. అదేవిధంగా మరో బోరు ఏర్పాటుకు త్వరలో చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

### రజకుల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి - మాల్యాద్రి, ఉపాధ్యక్షుడు



నియోజకవర్గంలోని అర్హులైన రజకులుకు రాయితీతో కూడిన రుణాలు, ఇంటినివేశన స్థలాలు ఇప్పించాలని కందుకూరు రజకసంఘం ఉపాధ్యక్షుడు పాకల మాల్యాద్రితో పాటు పలువురు రజకులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి విజ్ఞప్తిచేస్తున్నారు. కందుకూరు,వలేటివారిపాలెం, గుడ్లూరు, లింగసముద్రం, ఉలవపాడు మండలాల్లో సుమారు 10 వేల మందికిపైగా రజకులు ఉన్నారు.వీరిలో చాలా మంది వృత్తిపరికరాలైన ఇస్త్రిపెట్టె,బల్లలతోపాటు వృత్తిపరికరాలకు బీసీ కార్పోరేషన్ నుంచి సబ్సిడితోకూడిన రుణం మంజూరు చేయించాల్సిందిగా రజకసంఘ ఉపాధ్యక్షుడు పాకల మాల్యాద్రితోపాటు పలువురు ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేస్తున్నారు.

8_8.qxd 4/15/2026 12:17 AM Page 1



# అంబేద్కర్‌కు ఘన నివాళి



**పామూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల ప్రకారం పామూరు మండలం బొట్లగూడూరు పంచాయతీలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల ప్రధాన కార్యదర్శి, కనిగిరి నియోజకవర్గం క్లస్టర్ 11 ఇన్‌చార్జి అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి పాల్గొని మాట్లాడారు. తొలుత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ ఎంపీడీవో సుందర రామయ్య,పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ ఎర్రగుళ్ల బాల,కోటపాటి రాజా, ఆవులూరి మురళి శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఆవుల నరసింహారావు,విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ గరీబా, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను స్మరించుకోవాలి



పామూరు పట్టణంలో అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్‌ను స్మరించు కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ బొల్లా నరసింహారావు, మాజీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ సోమిశెట్టి వెంకటనారాయణ, కొండశెట్టి వెంకటరామయ్య, షేక్ అమీర్ బాబు, ఇర్రి కోటిరెడ్డి, ఒగూరు నరసింహారావు, పామూరు పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు ఒగూరు ఏడుకొండలు, జాతీయ బీసీ చైతన్య సమితి అధ్యక్షులు బద్దిపూడి మార్కు, ఏసు, శేషం, మోషే, కావేరి రసూల్, నర్సింగ్ సాంబశివరావు, గుత్తి కొండలరావు, విద్యా కమిటీ చైర్మన్ పతు మస్తాన్, పిడుగు శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ నాయలు, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

## సచివాలయంలో అంబేద్కర్‌కు ఘన నివాళి



పామూరులోని సచివాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిమ్మెర్ల గ్రామ అధ్యక్షులు నల్లబోతుల వెంకటేశ్వర్లు,సిద్దమూర్తి మల్లిఖార్జునరెడ్డి,టీడీపీ నాయకులు,కార్యకర్తలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి



**పామూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా కనిగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు పామూరు మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి సూచనలతో పామూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఎంపీపీ, రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్ గంగసానిలక్ష్మి, జడ్పీటీసీ సభ్యులు చప్పిడి సుబ్బయ్య, పామూరు టౌన్ అధ్యక్షులు చాంద్ భాషా, ఎంపీటీసీ అబ్దుల్, పిన్నిక రత్తయ్య, జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరామ్ శ్రీనివాసులు, ఏలిక అచ్చయ్య, పాలేటి ప్రేమ్ కుమార్, పోలేపల్లి సిద్దయ్య, సూరిపోగు మాల్యాద్రి, షేక్ కాలేషా, రసూల్ ఖాన్, రాచకొండ మధు, పఠాన్ రసూల్ ఖాన్, పోలు సుధార్, పాలపు వెంగళరావు, గడ్డం వెంకటనారాయణ, వై.సాల్మన్, బుసరాజుహరీష్, దూపాటిజగన్, వెంపాటి నారాయణ,మెడబలిమి దిలీప్, పోలు బాలిరెడ్డి, రంగారెడ్డి, నరేష్ తదితరులు బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మీ మాట్లాడుతూ భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా ఉండి, ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించారని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమానత్వ స్వప్నానికి అంబేద్కర్ దీపస్తంభం

### - వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నివాళులు



**కనిగిరి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక విప్లవ కారుడు బీఆర్ అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పేర్కొన్నారు.అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం, లింగ సమానత్వం కోసం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం అంబేద్కర్ జీవితాంతం పోరాడారని తెలిపారు. రాజ్యాంగ రచన ద్వారా ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అందించిన మహనీయుడని కొనియాడారు. బోధించు, సమీకరించు, పోరాడు అనే అంబేద్కర్ సిద్దాంతాన్ని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌జ గన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, గాయం బలరామిరకెడ్డి, కటికల వెంకటరత్నం, ఒకే రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, గూడూరి అబ్రహం లింకన్, చింతగుంట్ల కిషోర్‌బాబు, తాతపూడి సురేష్‌బాబు, వేసపోగు గురు ప్రసాద్, ఆవుల భాస్కర్‌రెడ్డి, మల్లెల వెలుగొండయ్య, రుద్రపాటి సాల్మన్ రాజు, పెరికల వెంకటేశ్వర్లు, బలసాని యోహోషువ, కుమ్మరికుంట రవి, సిరుప గోవర్ధన్‌రెడ్డి, పోలక సిద్దారెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, కంటు గురవయ్య, పులి శ్రీనివాసులురెడ్డి, కుమ్మరికుంట బాబు, పోతల రమేష్, కలికాయి నారాయణ, శ్యామల సాంబిరెడ్డి, షేక్ కాశీం వలి, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, అచ్చాల శ్రీనివాసరెడ్డి, సైకం వెంకటేశ్వరరెడ్డి, భూతపాటి సురేష్, కలుకూరి బాలస్వామి, షేక్ నాగూర్ వలి, షేక్ కరిముల్లా, కసిరెడ్డి రామసుబ్బారెడ్డి, షేక్ మీరావలి, షేక్ సన్నీ, పైడాల మోహన్‌రెడ్డి, కరాటపు రాజారావు, ముద్దా పౌలు, ఏకుల వెంకట సుబ్బారెడ్డి, యాళ్ల కృష్ణారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, భూమిరెడ్డి రామచంద్రారెడ్డి, తమ్మినేని రమణారెడ్డి, పిన్నిక మాధవ, చీమలదిన్నె శివ,శెట్టిపల్లి కొండయ్య, పొంకం పెద్దయోగి,పగడాల శివకృష్ణ, జగన్, గోడి నారాయణరెడ్డి, ఎరువ రవీంద్రరెడ్డి, సంగు కృష్ణారెడ్డి, పోతిరెడ్డి రమణారెడ్డి, యర్రబల్లి ఆంథోని, బక్క భాగ్యరాజ్, బక్క జాన్సన్, పొండ్రీ, కొండారెడ్డి, కటుకూరి చిన్న పేరయ్య, పాదిలి రియాజ్, షేక్ మున్నా, బాపట్ల లక్ష్మణ, రంగి తిరుపాలు, జుటికే మెరికమార్, పాలూరి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొని అంబేద్కర్‌కు ఘన నివాలులు అర్పించారు.

# ఎస్సీ,ఎస్టీలకు ఉచిత సౌర విద్యుత్

### - పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఉగ్ర





**కనిగిరి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పూర్తి సబ్సిడీతో సౌర విద్యుత్ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకాన్ని కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు.మంగళవారం కనిగిరిలోని కాశిరెడ్డి గిరిజన కాలనీలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ కాలనీలో ప్రతి కుటుంబం సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచుకుని లబ్ది పొందాలని సూచించారు. ఈ పథకం ద్వారా ఇళ్లపై సౌర ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకుని స్వయంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. సౌర విద్యుత్ వినియోగంతో విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్నిప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ ప్రాజెక్టు పీఏఎస్ఎల్ మూర్తి, కనిగిరి డివిజన్ ఈఈ ఉమాకాంత్, ఏడీఈ సునీల్ కుమార్,పవర్ సిస్టమ్ చరీష్,తెలుగుదేశంపార్టీ నాయకులు షేక్‌ఫిరోజ్,అచ్చాలరవి, బుల్ల బాలబాబు,రీటా ఫయాజ్,బి.రామసుబ్బారెడ్డి,గుడిపాటి ఖాదర్,షేక్ ఖాజా రెహ్మాన్, ఇస్మాయిల్,చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## నంబూరివారిపాలెంలో అంబేద్కర్ జయంతి వేడుకలు



**అద్దంకి, ఎఫ్రియల్ 14,ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు పట్టణంలోని నంబూరివారిపాలెం లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎఎస్ఐ అమరనాధ్, డిటిలు హజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బండారు ఆనందరావు, బౌజంకు నాగరాజు, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# వాడవాడలా అంబేద్కర్ జయంతి వేడుకలు

### - ఘనంగా నివాళులర్పించిన ఉద్యోగులు, దళిత నాయకులు, నేతలు, అభిమానులు

**దర్శి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

దర్శి పట్టణంలో అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.

**వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో :**






దర్శి శాసనసభ్యులు ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు దర్శి పార్టీ ఆఫీసులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమాన్నిఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో దర్శివైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు కేవీ రెడ్డి, స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ కార్యదర్శి పోలయ్య, దర్శి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు జి.ఏసుదాసు, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం,జాన్,శామ్యూల్,దర్శి మున్సి పాలిటీ కౌన్సిలర్ మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరు బాబురావు,ఆవుల జ్యోతి శివారెడ్డి, ఎంపీటీసీ బండి గోపాల్‌రెడ్డి, దర్శి టౌన్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డి, దర్శి నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు షేక్ బుజ్జి, దర్శి పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

**ప్రజా సంఘాల ఆధ్వర్యంలో :**

స్థానిక ఎంపీడీవో ఆఫీసు ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర దళిత సేన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కవలకుంట్ల గోవింద ప్రసాద్ మాదిగ అధ్యక్షతన సభా కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మర్రిపూడి పశువైద్యాధికారి డాక్టర్ మంచికల మణిశేఖర్, దర్శి ఎంపీపీ గోళ్ళపాటి అచ్చయ్య సుధారాణి. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్.పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దళిత సంఘాల నాయకులు గర్నెపూడి ప్రేమ్ కుమార్, గంధం ఇర్మియా, గర్నెపూడి ఇత్తడి దానియేలు, కేసనపల్లి నరేష్, గూడూరియోగేశ్వరరావు, తాళ్లూరి లాజర్, బీజేపీ నాయకులు నారాయణరెడ్డి, మాడపాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**వ్యవసాయ పరిశోధన స్థానంలో :**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు వ్యవసాయ పరిశోధనంలో మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ పి.సంధ్యారాణి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాదరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం రీసెర్చ్ అసోసియేట్ హరిత, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

**మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో :**

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎంపీడీవో ఆఫీసు ప్రాంగణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రమానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అద్దంకి రోడ్డులోని గురుకుల పాఠశాల నందు పాఠశాల వారు నిర్వహిస్తున్న అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి.వరప్రసాద్‌రావు, కే.శ్రీనివాస్‌రెడ్డి, డి.వెంకట రెడ్డి, సీహెచ్ బసవయ్య, జి.వేణు, సీహెచ్ తిరుపతిరెడ్డి, షేక్ కాదర్ మస్తాన్, జే.సుశీల, ఏ.వెంకటేశ్వర్లు, ఎన్.వెంకటరావు, ఎం.బ్రహ్మారెడ్డి, ఆర్.నారాయణ, ప్రేమ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ మీరాలు పాల్గొన్నారు.

**బీజేపీ ఆధ్వర్యంలో :**

బీజేపీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతిని దర్శి ఎంపీడీవో ఆఫీసు నందు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరక్టర్ మాడపాకుల శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి, నాయకులు కాకర్ల నాగసాయి, వల్లభ వర అమరేశ్వరరావు, చేస్తాది ఆంజనేయులు, మందలపు శేషయ్య, శివకోటచారి, శ్యామ్ కుమార్, రామాంజనేయులు, అరుణ్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కృషి విజ్ఞాన కేంద్రంలో :**

కృషి విజ్ఞాన కేంద్రం నందు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.మానస, ఎం.గౌస్ భాషా, కే.సంధ్యారాణి, సీహెచ్ నారాయణ, పి.రామ్మోహన్‌రావు, శేఖర్, వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**జై భీమ్ యువత ఆధ్వర్యంలో :**

ప్రపంచ మేధావి నవభారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు దర్శి జై భీమ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. జై భీమ్ సైన్యం యువత డిజే సౌండ్ సిస్టంతో దర్శి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నెరెళ్ల జాన్ న్యాయవాది మెత్తడి జోషి, రిపోర్టర్ దిడ్ల రమేష్, పీఆర్ ఈవెంట్స్ ఆర్గనైజర్ ధర్నాసి కోమల్ బహుజన నాయకులు కవలకుంట్ల గోవింద ప్రసాద్, రాచపూడి కరుణానిధి పాల్గొని ఈ ర్యాలీకి నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ యువత పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో :**

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి కైపు కృష్ణారెడ్డి అధ్యక్షతన మంగళవారం దర్శి ఎంపీడీవో కార్యాలయం వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నెగంటి ప్రశాంత్, దర్శి మండల పరిశీలకులు ఇరిగినేని వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

**ముండ్లమూరు :**

ముండ్లమూరు మండలంలోని ముండ్లమూరు, మారెళ్ళ గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సభలు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రైతు వ్యవసాయ కార్మిక సంఘం సీఐటీయు సంఘాలుఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.హనుమంతరావు, వెల్లంపల్లి ఆంజనేయులు, కే.శ్రీనులు అంబేద్కర్ విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంట ఏడుకొండలు,సత్యం,ఎర్రయ్య, ఎం.దాసు, బి.రాజా,జ్యోతి, బోడపాటి హనుమంతరావు, నాగార్జునరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుభాష్, వంశీ, అశోక్, హర్ష, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌కు ఘన నివాళి - గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, ఏప్రిల్ 14, ప్రభాతార్త**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్రకార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ.మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్స్‌కి శిక్షణ ఇస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం క్లస్టర్లు ఇన్‌చార్జీలు, కో క్లస్టర్ల ఇన్‌చార్జీలకు తెలుగుదేశం పార్టీ శిక్షణా తరగతులలో భాగంగా శిక్షణా ఇస్తున్న దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ.

# అంబేద్కర్ సేవలు మరువలేనివి



**లింగసముద్రం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

ఆర్థిక అసమానతలను రూపుమాపి సమసమాజ స్థాపన కోసం భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక విప్లవకారుడు భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన కృషి,సేవలు నిరూపమానం, చిరస్మరణీయ మైనవని వైసీపీ నాయకులు అన్నారు. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం, లింగ సమానత్వం కోసం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం ఆయన జీవితాంతం పోరాడారన్నారు. రాజ్యాంగ రచన ద్వారా ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం కల్పించిన గొప్ప మేధావి ఆయన అని కొనియాడారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు నోటి వెంకటేశ్వరరెడ్డి, పిచ్చిపాటి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ చీమల శ్రీను, షేక్ షఫీ, కళ్లగుంట ప్రసాద్, సోషల్ మీడియా సభ్యులు జునైద్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆలోచనలు సమాజానికి దారి చూపుతున్నాయి - ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



**కనిగిరి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఒంగోలు బస్టాండ్ సెంటర్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు సమానత్వం,సామాజిక న్యాయం,విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతున్నాయని అన్నారు. రాజ్యాంగం రూపొందించడంలో ఆయన చేసిన సేవలు చాలా గొప్పవని చెప్పారు. అణగారిన వర్గాల కోసం ఆయన చేసిన పోరాటం అందరికి స్ఫూర్తి అని తెలిపారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ చూపిన మార్గంలో నడవాలని, ముఖ్యంగా యువత చదువును ఆయుధంగా చేసుకుని సమాజంలో మార్పు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరు ప్రకాశం, అద్దంకి రంగబాబు, షేక్ ఫిరోజ్, గోవా ప్రతాప్, అచ్చాల రవి, రాచమల్ల శ్రీనివాస్‌రెడ్డి, పాతూరు నాగ, బుల్ల బాలబాబు, షేక్ ఖాజా రెహమాన్, షేక్ గయాజ్, గుడిపాటి ఖాదర్, రామ సుబ్బారెడ్డి, పచ్చవ చంద్రశేఖర్,జాన్సన్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ఎంపీపీ దంతులూరు ప్రకాశం, అద్దంకి రంగబాబు, షేక్ ఫిరోజ్, గోవా ప్రతాప్, అచ్చాల రవి, రాచమల్ల శ్రీనివాస్‌రెడ్డి, పాతూరు నాగ,బుల్ల బాలబాబు,షేక్ ఖాజా రెహమాన్, షేక్‌గయాజ్,గుడిపాటి ఖాదర్,రామ సుబ్బారెడ్డి, పచ్చవ చంద్రశేఖర్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## సోలార్‌తో విద్యుత్ వినియోగ ఛార్జీలు ఆదా - మంత్రి గొట్టిపాటి





**సంతమాగులూరు, ఎఫ్రియల్ 14, ప్రభాతవార్త**

మండలంలోని నెహ్రూ నగర్ ఎస్టి కాలనీలో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకం కింద ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా 38 కుటుంబాలు తమ ఇళ్లపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో రూ.1.25 లక్షల విలువైన 2 కిలోవాట్ల సోలార్ యూనిట్లను ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఓసీలకు రూ.78 వేల సబ్సిడీ, బీసీ వర్గాలకు రూ.98 వేల సబ్సిడీతో సోలార్ యూనిట్లు అందిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి వివరించారు. ఈ యూనిట్ల ద్వారా విద్యుత్ ఛార్జీలు గణనీయంగా తగ్గుతాయని, మిగులు విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేసి లబ్ధిదారులకు నగదు అందిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల దాటినా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ ఛార్జీలు పెంచకుండా, తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. అనంతరం నెహ్రూ నగర్‌లో 1.80 కోట్ల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్లు, అంతర్గత రహదారులను ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఎవరికైనా అవసరం వచ్చినప్పుడు తాను అండగా ఉంటానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యం పిపి యానుబర్ల యల్లమంద, ఏ యం సి చైర్మన్ తేలప్రోలు రమేష్, టిడిపి మండల అధ్యక్షులు చేవూరి వాసురెడ్డి, నాయకులు ఆలూరి శ్రీనివాసరావు, అట్లా పేద వెంకటరెడ్డి, గడ్డం నాగిరెడ్డి, గడ్డం మహాలక్ష్మి పేర్లు యాడ్ చేయి మాజీ సర్పంచ్ సన్నేబోయిన గురు యాదవ్, మొగిలి సుబ్బారావు లబ్ధిదారులు, కూటమి నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆదర్శాలతో ముందుకు సాగుదాం - మంత్రి గొట్టిపాటి





**సంతమాగులూరు, ఎఫ్రియల్ 14,ప్రభాతవార్త**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తిగా, ఆయన ఆదర్శాలతో ముందుకు సాగాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండల కేంద్రమైన సంతమాగులూరులో మంగళవారం జరిగిన అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమంలో మంత్రి రవికుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సమానత్వంతో జీవించాలనే ఉద్దేశంతోనే అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. భారత రాజ్యాంగం తర్వాత కాలంలో అనేక దేశాల రాజ్యాంగాలకు స్ఫూర్తిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. మహిళలకు ఆస్తి హక్కులు, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించే విధంగా రాజ్యాంగంలో అనేక నిబంధనలు పొందుపరిచినట్లు వివరించారు. విద్యకు అంబేద్కర్ అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, జ్ఞానం మన నుంచి ఎవరూ దూరం చేయలేరని అన్నారు. కేవలం చదువుతోనే అంబేద్కర్ ఉన్నత శిఖరాలను అధిరోహించారని గుర్తుచేస్తూ, ఆయన పోరాట ఫలితాలను ఆచరిస్తే సమాజం సుఖశాంతులతో అభివృద్ధి చెందుతుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమం లో యం పిపి ఏనుబర్ల యల్లమంద,టిడిపి రాష్ట్ర కార్యదర్శి దూపాటి ఏసోబు, ఎ యం సి చైర్మన్ తేలప్రోలు రమేష్, టిడిపి మండల అధ్యక్షులు చేవూరి వాసురెడ్డి, అట్లా పేద వెంకట రెడ్డి, ఆలూరి శ్రీనివాసరావు, గడ్డం నాగిరెడ్డి, గడ్డం మహాలక్ష్మి, మాజీ సర్పంచ్ సన్నెబోయిన గురుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన చింతలపూడి



**అద్దంకి, ఎఫ్రియల్ 14, ప్రభాతవార్త**

అద్దంకి పట్టణం, 5వ వార్డులోని రాజీవ్ కాలనీలో వైఎస్ఆర్సీపీ నాయకులు వినుకొండ ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాని అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైఎస్ఆర్సీపీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంత రావు ,అద్దంకి పట్టణ వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, యువజన విభాగం నాయకులు,స్థానిక వైఎస్ఆర్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## రెడ్ బుక్ పేరుతో కూటమి ఆరాచకపు పాలన - డాక్టర్ చింతలపూడి



**అద్దంకి, ఎఫ్రియల్ 14, ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు అద్దంకి పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అశోక్ కుమార్ చింతలపూడి పాల్గొని,అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు, ప్రజలకు మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. నేడు సమాజంలో ప్రతి పౌరుడు స్వేచ్ఛగా, సమానత్వంతో జీవిస్తున్నాడంటే అది ఆయన రాసిన రాజ్యాంగం వల్లేనని గుర్తుచేశారు. రాజ్యాంగంలోని ప్రతి పేజీ పౌరుల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పిస్తుందని అన్నారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా, రాజ్యాంగేతరంగా రెడ్ బుక్ పాలన సాగిస్తూ ప్రజలను, విపక్షాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు.ప్రస్తుతం అధికారం మీ చేతుల్లో ఉంది కాబట్టి అరాచకాలు సాగిస్తున్నారు. ప్రజలందరూ గమనిస్తున్నారు, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న వారికి రానున్న కాలంలో ప్రజలు ఖచ్చితంగా తగిన బుద్ధి చెప్తారు" అని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, పోరాడాలని, సమానత్వం కోసం శ్రమించాలని అంబేద్కర్ ఇచ్చిన పిలుపును వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్ఫూర్తిగా తీసుకుందని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడటానికి తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో యువతను పెడదారి పట్టిస్తున్న గంజాయిని నిర్మూలించాలని, అన్యాయాలను ఎదుర్కోవడంలో ప్రజలకు మనోధైర్యాన్ని కల్పించేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని అశోక్ కుమార్ చింతలపూడి పేర్కొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేత



**అద్దంకి, ఎఫ్రియల్ 14, ప్రభాతవార్త**

డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భముగా 12వ తేదిన శ్రీ ప్రకాశం బాలుర ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ సేవాసమితి వారు నిర్వహించిన జ్యోతిరావ్ పూలే జీవిత చరిత్ర గురించి నియోజకవర్గ స్థాయిలో జరిగిన వకృత్వ పోటీలో సెయింట్ జోషఫ్ స్కూల్ అద్దంకి విద్యార్థులైన కావ్య,ఎం.చాతుర్య ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలుపొందారు. విద్యార్థులకు మంగళవారం అద్దంకి పట్టణంలో బంగ్లా రోడ్డులో జరిగిన డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలలో నరేంద్ర విజేతలకు నగదు రూపంలో అందజేశారు.

## మాజీ సిఎంను కలిసిన చింతలపూడి



**అద్దంకి, ఎఫ్రియల్ 14, ప్రభాతవార్త**

తాడేపల్లి వైఎస్ఆర్సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసారు. నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులను జగన్‌మోహన్‌రెడ్డి తో అశోక్‌కుమార్ చర్చించినట్లు సమాచారం.

# రాతి ముఖమండపానికి లక్ష విరాళం



**అద్దంకి, ఎఫ్రియల్ 14, ప్రభాతవార్త**

సింగరకొండలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం రాతి ముఖమండపం నిర్మాణానికి, సంతమాగులూరు మండలం , మక్కిన వారి పాలెం చెందిన ఏలూరు వీరనారాయణ ధర్మపత్ని విజయలక్ష్మి వారి కుమారుడు ఆదిత్య చౌదరి దేవస్థానానికి రు.1,11,116.00 రూపాయలు దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు చుండూరు మురళీ సుధాకర్‌రావు అందజేసినారు.ఈ కార్యక్రమంలో ఆలయఅర్చకులు చినబాబు,కిషోర్,సుదర్శనం,సీతారామాంజనేయ చార్యులు పాల్గొన్నారు.దాతలకు స్వామివారి పూజా కార్యక్రమం అనంతరం స్వామి వారి శేష వస్త్రము,చిత్రపటం, తీర్థ ప్రసాదం ఇచ్చి స్వామివారి ఆశీర్వచనం అందజేశారు.

